క్లుప్తంగా

ప్రమాదకరంగా మూలమలుపు



లింగాపూర్ -గోపాల్‌పూర్ రోడ్డుపై ఉన్న మూలమలుపు

లింగాపూర్: మండలకేంద్రం నుంచి గోపాల్‌పూర్‌కు వెళ్లే రహదారిలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన మునీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సాజిద్, నాయకులు చౌదరి తరుపతి, శ్రీనివాస్, కొండయ్య, గణపతి, పెంటయ్య, సదాశివ్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మున్నూరు కాపు మండల యూత్ కమిటీ, జిల్లా అడహక్ కమిటీలను బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల యూత్ అధ్యక్షుడిగా వినోద్, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి శ్యాం సుందర్‌లను ఎన్నుకున్నారు. జిల్లా అడహక్ కమిటీ సభ్యులుగా ఆసిఫాబాద్ నుంచి గాజుల జక్కయ్య, గడ్డల శంకర్, చిట్ల నారాయణ, రెబ్బెన నుంచి సత్యనారాయణ, తిరుపతి, చింతలమానపల్లి నుంచి రాజయ్య, శ్రీకాంత్, కౌటాల నుంచి కిష్టయ్య, పెంచికల్‌పేట్ నుంచి సాయి, తిర్యాణి నుంచి సంపత్, శంకర్, దహెగాం నుంచి సత్యనారాయణ, సతీశ్‌కుమార్, కాగజ్‌నగర్ నుంచి గజ్జి రామయ్య, రాజశేఖర్, కిరణ్, శంకరమ్మలను ఎన్నుకున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలని మాజీ కౌన్సిలర్లు జైచందర్, ఎల్లేశ్‌లు సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాపువాడ, మారుతినగర్, సీబాపుకాలనీ, సంజీవయ్య కాలనీల మధ్య మంజూరైన రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తే పట్టణంలో ఆయా కాలనీల వాసులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు



మోటరు ద్వారా నీటి సరఫరా చేస్తున్న అధికారులు

నార్నూర్: గాదిగూడ మండలం కొటాల గ్రామంలో ఆదివాసీ కుటుంబాలు నీటి కోసం పడుతున్న కష్టాల నేపథ్యంలో 'నీటి తిప్పలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సాయిసాగర్ బుధవారం చేతిపంపునకు మోటార్ బిగించి నీటి సరఫరా అందించారు. నీటి సరఫరా కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యం.. పరిహాసం



రైల్వేక్వార్టర్స్ లైన్‌లో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం

- రోడ్లపైనే చెత్తాచెదారం
- దుర్గంధం వెదజల్లుతున్న రైల్వేకాలనీలు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వే కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. రైల్వే కాలనీలు ఎటు చూసినా చెత్తాచెదారంతో నిండి దర్శనమిస్తున్నాయి. క్వార్టర్స్‌లోకి వర్షపు నీరు చేరుతుండడంతో పాటు క్వార్టర్స్ పరిసరాలలో పిచ్చి మొక్కలు పేరుకుపోయి నడిచేందుకు వీలులేకుండా పోయింది. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో పాటు రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబాలకు తిప్పలు..

కాగజ్‌నగర్ రైల్వేక్వార్టర్స్‌లలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలు ఇటీవల వచ్చిన రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్, డీఆర్‌ఎం గోపాలకృష్ణన్‌కు పారిశుద్ధ్య నిర్వహణ లోపంపై విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వచ్చినప్పుడు హడావుడీగా, నామమాత్రంగా పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారే తప్పా అనంతరం ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షాలకు క్వార్టర్స్‌లలోకి నీరు చేరి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కాలనీల్లో రోడ్లపై పిచ్చి మొక్కలు పెరగడంతో రాత్రి వేళలో స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో భయంభయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన క్వార్టర్లకు మరమ్మతులు చేయించి, కాలనీలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.



మురుగు కాలువలో చెత్తాచెదారం



రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మహిళ (ఫైల్)

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంబరాలు నిర్వహిస్తున్న సిబ్బంది



ఆసిఫాబాద్‌రూరల్: మెడికల్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మెడికల్ కాలేజీలో బుధవారం విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర డిగ్రీ, జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో బతుకమ్మను రంగురంగుల పూలతో పేర్చి విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ ఆడిపాడి సంబరాలు జరుపుకున్నారు.

నార్నూర్‌లో..



కాగజ్‌నగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు అద్దం పట్టేలా విద్యార్థినులు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కాంబ్లే బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఒడ్డుగూడ గ్రామస్తులు

దహెగాం: గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని ఒడ్డుగూడ గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యదర్శి లతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధి దీపాలు లేక పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో వీధి దీపాలు వెంటనే ఏర్పాటు చేయాలని, గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కొండ చిలువతో భయాందోళన



ఎస్పీఎం సమీపంలో కొండ చిలువ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్, సర్దార్‌బస్తీ, ఎస్పీఎం పరిసర ప్రాంతాల్లో కొండ చిలువ తరుచూ సంచరిస్తుండడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం ఎస్పీఎం గోడ పక్కన 15 అడుగుల కొండ చిలువ కాలనీవాసుల కంట పడింది. సంబంధిత అటవీ అధికారులు కొండచిలువను పట్టుకొని అడవిలో వదిలేయాలని స్థానికులు కోరుతున్నారు.

భగీరథ నీరు సరఫరా చేయాలని ఆందోళన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ కాలనీకి గత 20 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో విసుగు చెందిన కాలనీవాసులు బుధవారం సందీప్‌నగర్ ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ గత 20 రోజులుగా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులకు సమస్యపై విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరమ్మతుల కోసం సిబ్బంది తూతూమంత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న బజార్‌వాడీ కాలనీవాసులు

సులభ్ కాంప్లెక్స్ వినియోగంలోకి తేవాలి

రెబ్బెన: మండల కేంద్రంలో నిర్మాణ పనులు పూర్తయిన సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పని మీద మండల కేంద్రానికి వస్తారని మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రానికి వచ్చిన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం గెస్ట్‌హౌస్ ఆవరణలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే సులభ్‌కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



మూసి ఉన్న సులభ్‌కాంప్లెక్స్ చూపుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం

'వాగుపై హై లెవల్ వంతెన నిర్మించాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: తుంపెల్లి వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని డీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. బుధవారం కురిసిన వర్షానికి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వాగుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి హై లెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. లేకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవ్రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి రూపంలో అమ్మవారు దర్శనం



దహెగాం: పూజల్లో పాల్గొన్న భక్తులు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కంకణదారులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



రెబ్బెన: పూజలు చేస్తున్న తహసీల్దార్

తహసీల్దార్ పూజలు

రెబ్బెన: నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ సూర్యప్రకాశ్ కుటుంబ సమేతంగా ఇందిరానగర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇందిరానగర్ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్‌స్వామి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఆసిఫాబాద్ కేజీబీవీలో పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీజీఈడబ్ల్యూఐడీసీ ఎస్ఈ షఫీ అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కేజీబీవీ పాఠశాలలు, భవితా సెంటర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈఈ అశోక్, డీఈ సమ్మిరెడ్డి, ఏఈలు కిరణ్, శశిధర్, ప్రవీణ్, గిరీశ్, ఎస్‌వో అబిద్‌అలీ, సైన్స్ అధికారి మధుకర్ ఉన్నారు.

పూలు, పండ్ల మొక్కలపై ఆసక్తి



గోయగాం పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోస్తున్న విద్యార్థినులు(ఫైల్)

- పాఠశాలల్లో నాటేందుకు విద్యార్థుల మొగ్గు
- నర్సరీల్లో కానరాని పూలు, పండ్ల మొక్కలు

కెరమెరి: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు విరివిగా మొక్కలు నాటుతున్నారు. విద్యార్థులు ఎక్కువగా పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే పూలు, పండ్ల మొక్కలు తక్కువగా అందుబాటులో ఉండడంతో విద్యార్థులు నిరుత్సాహం చెందుతున్నారు. కొన్ని పాఠశాలల్లో సొంత డబ్బుతో ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను తెప్పించి నాటుతుండగా మిగితా పాఠశాలల్లో అధికారులు పూలు, పండ్ల మొక్కలు అందించాలని కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పూలు, పండ్ల మొక్కలకు డిమాండ్

వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అనేక పాఠశాలల్లో పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రస్తుతం ఇతర మొక్కల కంటే పూలు, పండ్ల మొక్కలకు డిమాండ్ పెరిగింది. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 31 నర్సరీలు ఉన్నాయి. అందులో 3 లక్షల మొక్కలను అందుబాటులో ఉంచారు. మండలంలో 97 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ పాఠశాలలు ఉండగా, ఐదు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అందులో 5,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా ప్రభుత్వ పాఠశాలలకు 5,190 మొక్కలు అందించగా అందులో కేవలం 437 మొక్కలే పూలు, పండ్లకు సంబంధించినవి ఉన్నాయి. కెరమెరి నర్సరీలో మినహా ఎక్కడ కూడా పూలు, పండ్ల మొక్కలు లేవు. దీంతో పూలు, పండ్ల మొక్కలు తక్కువగా పంపిణీ చేస్తున్నారు.

ఆశ్రమాల్లో స్థలం పుష్కలం

మండలంలోని మోడి, హట్టి, నార్‌పల్లి, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలతో పాటు గోయగాం, ఝరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్థలం పుష్కలంగా ఉంది. ఇక్కడ అనుకున్న స్థాయిలో మొక్కలు పెంచవచ్చు. కానీ విద్యార్థులు ఇతర మొక్కల పెంపకంపై ఆసక్తి చూపడం లేదు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం «ఏక్ పేడ్ మా కే నామ్» అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతీ విద్యార్థి తల్లి పేరిట ఒక మొక్కను నాటి ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నప్పటికీ అవి పాఠశాలలకు ఉపయోగపడే మొక్కలు కావు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఒక్క రోజే 703 మొక్కలను పాఠశాలల్లో నాటారు.

మొక్కలను బతికిస్తాం..



ఇటీవల మా పాఠశాలలో విద్యార్థులందరం తల్లి పేరిట ఒక మొక్క నాటి మేరీలైఫ్ పోర్టల్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేశాం. వాటిని సంరక్షించేందుకు రోజూ నీరు పోస్తున్నాం. పాఠశాలలో పూలు, పండ్ల మొక్కలు నాటేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అనూష, విద్యార్థిని, పదో తరగతి

తక్కువగా ఉన్నాయి..



అన్ని పాఠశాలల్లో విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటారు. ఇటీవల ఏక్ పేడ్ మా కే నామ్ అనే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మొక్కలు నాటాం. పూలు, పండ్ల మొక్కలు అతి తక్కువగా అందుబాటులో ఉన్నాయి.

– ఆదే ప్రకాశ్, ఎంఈవో

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పెంటుబాయి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ అంగన్‌వాడీ 1, 2, 3, 4 కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు 'పోషణ్ మహోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



లింగాపూర్: కంచన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

లింగాపూర్: పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూపర్‌వైజర్ సోంబాయి అన్నారు. బుధవారం మండలంలోని కంచన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపం వలన కలిగే అనర్థాలపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సత్యకళ, రంభ, విజయలక్ష్మి, అంబికా, కౌశాల, బుజ్జిబాయి, అనూష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి..!



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారింది. దీంతో మెడికల్ కళాశాల, ఆర్డీవో కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు, వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే రోడ్డు గుండా జిల్లా అధికారులు సైతం వెళ్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.